నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, ఆదివారం 16 జూన్ 2024 | KHAMMAM

ఎమ్మెల్సీ తాతా మధుకు పరామర్శ



తాతా మధును పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

తాతా మధును పరామర్శిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా, మాజీ ఎమ్మెల్యే

ఖమ్మం, జూన్ 15 : ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు శనివారం రాత్రి హైదరాబాద్‌లో పరామర్శించారు. తాతా మధు ఇటీవల అస్వస్థతకు గురై స్వల్ప శస్త్రచికిత్స చేసుకున్న విషయం తెలుసుకున్న హరీశ్‌రావు ఆయన్ని పరామర్శించారు. తాతా మధును పరామర్శించిన వారిలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడెం మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అర్జీలు నిరంతరం స్వీకరించాలి : జడ్పీ సీఈవో వినోద్

ఆస్పత్రిని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జడ్పీ సీఈవో వినోద్

బోనకల్లు, జూన్ 15 : ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించాలని, ఇది ప్రజా పాలనలో నిరంతర ప్రక్రియ అని జడ్పీ సీఈవో వినోద్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన మండలంలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎంపీడీవో రాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోని వారి కోసం మండల పరిషత్ కార్యాలయాల్లో మళ్లీ దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దరఖాస్తులు తీసుకోలేదని, మళ్లీ యథావిధిగా దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన 2022లో 17వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన రూ.10 లక్షల నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. వీటికి సంబంధించిన బిల్లులతోపాటు మెజర్‌మెంట్స్ రికార్డులను పంపించాలని వైద్యాధికారి స్రవంతిని ఆదేశించారు. ఆ నిధులతో చేపట్టిన వివిధ పనులను ఆయన పరిశీలించారు. సీఈవో వెంట ఎంపీడీవో రాజు, ఎంపీవో కోటేశ్వరశాస్త్రి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల లింకులకు స్పందించొద్దు..

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, జూన్ 15 : సైబర్ నేరగాళ్లు పంపిస్తున్న లింకులు, మెసేజ్‌లకు స్పందించి మోసపోవద్దని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌బీఐ యూనో అప్లికేషన్స్ ఉపయోగిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఏ బ్యాంక్ అయినా అప్‌డేట్ కోసం వివరాలు అడగవని, మోసపూరిత మెసేజ్‌లలో వచ్చిన లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్లు డాటాలో ఉన్న ఫోన్ నంబర్ల ఆధారంగా మీ అకౌంట్‌లో రివార్డు నగదు జమ అవుతుందని, మీ కేవైసీ అప్‌డేట్ కాలేదని, మీ ఎస్‌బీఐ యూనో అకౌంట్ బ్లాక్ అయిందని, అన్ బ్లాక్ కోసం పాన్ కార్డ్ నంబర్ లింకులో నమోదు చేస్తే అప్‌డేట్ అవుతుందని మెసేజ్ పంపిస్తూ మోసం చేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఏదో ఆశ చూపి వలవేస్తుంటారని, గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్‌లో మాట్లాడి ఏదైనా స్కీమ్ గురించి చెబితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో పడి మోసపోతే.. వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే నగదును రికవరీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

బాస్‌ల బదిలీ

- పలువురు ఐపీఎస్ అధికారులు సైతం..
- ఖమ్మం కొత్త కలెక్టర్‌గా ముజామ్మిల్ ఖాన్
- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా జతీశ్ వీ పాటిల్
- ఖమ్మం మున్సిపల్ కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, భద్రాచలం ఐటీడీఏ పీవోల బదిలీ
- వనపర్తి కలెక్టర్‌గా ఆదర్శ్ సురభి, జగిత్యాల కలెక్టర్‌గా సత్యప్రసాద్, వికారాబాద్ కలెక్టర్‌గా ప్రతీక్ జైన్

ఖమ్మం కొత్త కలెక్టర్‌గా ముజామ్మిల్ ఖాన్

భద్రాద్రి కొత్తగూడెం కొత్త కలెక్టర్‌గా జతీశ్ వీ పాటిల్

ఖమ్మం, జూన్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లతోపాటు పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌ను బదిలీ చేసి.. ఆయన స్థానంలో పెద్దపల్లి కలెక్టర్‌గా పనిచేస్తున్న ముజామ్మిల్ ఖాన్‌ను నియమించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలను బదిలీ చేసి.. ఆమె స్థానంలో జతీశ్ వీ పాటిల్‌ను కలెక్టర్‌గా నియమించింది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా 2021 అక్టోబర్ 20వ తేదీ నుంచి పనిచేస్తున్న ఆదర్శ్ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఖమ్మం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న సత్యప్రసాద్‌ను జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా నియమించింది. 2023 జూలై 15వ తేదీ నుంచి భద్రాచలం ఐటీడీఏ పీవోగా పని చేస్తున్న ప్రతీక్ జైన్‌ను వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి బదిలీ అయిన ఐదుగురు ఐఏఎస్ అధికారుల్లో ముగ్గురు అధికారులు కలెక్టర్లుగా నియమితులు కావడం విశేషం. వీపీ గౌతమ్, ప్రియాంక ఆలకు ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. ఖమ్మం నగర మున్సిపల్ కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఐటీడీఏ పీవో స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు. ఒకటీ రెండ్రోజుల్లో నియమించే అవకాశం ఉంది.

పాలనలో అధికారుల ముద్ర..

సుదీర్ఘకాలం ఖమ్మం కలెక్టర్‌గా పనిచేసిన వీపీ గౌతమ్ జిల్లాపై పాలనాపరంగా తనదైన ముద్ర వేశారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌ను సమర్థవంతంగా నిర్వహించి రాష్ట్రంలో ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలిచేలా చేసి అప్పటి ప్రభుత్వ, ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన దళితబంధు పథకాన్ని ఖమ్మం జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన చింతకాని మండలంలో ఈ పథకం వందశాతం అమలయ్యేలా చేసి లబ్ధిదారుల మన్ననలు పొందారు. ఉపాధి అవకాశాలను మూస పద్ధతిలో కాకుండా ఏయే రంగంలో వ్యాపారాభివృద్ధికి అవకాశం ఉందో పరిశీలించి వినూత్న ఆలోచనలు కల్పించి, ఉపాధి మార్గాలను అన్వేషించి దళితబంధుకు ఎంపికైన వారికి ఆయా రంగాల్లో అవగాహన, శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడంలో ప్రత్యేక చొరవ తీసుకున్న అధికారిగా గుర్తింపు పొందారు. గత ఏడాది జరిగిన శాసనసభ, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన అధికారిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఖమ్మం జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారి, గ్రీన్‌ఫీల్డ్ హైవే, మూడో రైల్వేలైన్‌కు అవసరమైన భూసేకరణ చేయడంలోనూ, భూ నిర్వాసితులకు పరిహారం అందించడంలోనూ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గత జూలై నెలలో కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ప్రియాంక ఆల సౌమ్యురాలిగా, సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. గత సంవత్సరం గోదావరి వరదల సమయంలో బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు చేపట్టి ప్రశంసలు అందుకున్నారు. పాలనాపరమైన అంశాల్లో నిక్కచ్చిగా ఉంటామని, ముక్కుసూటిగా వ్యవహరిస్తారని పేరొందారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆదర్శ్ సురభి ఖమ్మం నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. లకారం ట్యాంక్‌బండ్ ఆధునీకరణ, పార్కుల ఏర్పాటు, రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ క్రమబద్ధీకరణ, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ వంటి అంశాల్లో సురభి తనదైన ముద్ర వేసి పాలనాదక్షతను చాటుకున్నారు. ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఏడాది క్రితం సిరిసిల్ల నుంచి ఖమ్మం వచ్చిన సత్యప్రసాద్ స్థానిక సంస్థల వ్యవహారాలపై మంచి పట్టున్న అధికారిగా నిబద్ధత కలిగిన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో సమస్యలను సత్వరం పరిష్కరించడంలో అగ్రగామిగా ఉంటారని, క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పాలనాపరమైన పట్టు సాధించారన్న పేరు పొందారు. ఐటీడీఏ పీవోగా గత జూలైలో బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్ సౌమ్యుడిగా, పాలనా దక్షత కలిగిన అధికారిగా గుర్తింపు పొందారు. గిరిజనుల సమస్యలపై పూర్తిస్థాయి అవగాహనా కలిగిన అధికారిగా, క్షేత్రస్థాయిలో పర్యటన చేయడం ద్వారా గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేసిన అధికారిగా పేరుపొందారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి వసతి సౌకర్యాలు కల్పించడానికి తీవ్రస్థాయిలో కృషి చేశారు. భద్రాచలంలో గోదావరి వరదల సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు వసతి సౌకర్యాలు కల్పించిన అధికారిగా గుర్తింపు పొందారు.

ఊళ్లకు వెలుగులు!

- పరిష్కారమైన గిరిజనుల విద్యుత్ సమస్య
- ఆనందం వ్యక్తం చేస్తున్న రెండు గ్రామాల ప్రజలు
- పూర్తయిన పనులను పరిశీలించిన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

గ్రామస్తులతో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

దుమ్ముగూడెం, జూన్ 15 : 'తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదు. కారు చీకట్లోనే కాలం వెళ్లదీస్తున్నాం. పంటలు పండించుకోవడానికి ఇంకా డీజిల్ మోటర్లను వినియోగిస్తున్నాం. విద్యుత్ సౌకర్యం కల్పించి మా ఊళ్లల్లో వెలుగులు ప్రసాదించండి.. పంటలు పండించుకునేలా చేయండి సారూ..' అంటూ కొన్ని నెలల క్రితం దుమ్ముగూడెం మండలం సింగవరం, ఎన్ లక్ష్మీపూర్ గ్రామాల్లో పర్యటించిన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్‌కు ఆయా గ్రామాల ప్రజలు మొరపెట్టుకున్నారు. వారు అడిగిందే తడవుగా.. మీ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన పీవో మాట నిలబెట్టుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించిన ఆయన ఆయా గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఇప్పుడు విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్నాయి. తమ గ్రామాల్లో వెలుగులు చూసిన గిరిజన ప్రజలు సంబురపడుతున్నారు. అయితే ఆయా గ్రామాల్లో విద్యుత్ పనులను శనివారం పరిశీలించిన పీవో మాట్లాడుతూ పై రెండు గ్రామాల రైతులు విద్యుత్ సౌకర్యం లేక వాగునీటిపైనే ఆధారపడి పంటలు పండించుకునే వారని, బావులు ఉన్నా కరెంట్ సౌకర్యం లేక డీజిల్‌తో మోటార్లు నడుపుకునే వారని, ఖర్చు ఎక్కువ, ఆదాయం తక్కువ రావడం వల్ల నష్టపోతున్నామని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన 117 మంది రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. విద్యుత్ శాఖ సబ్సిడీతో కలుపుకొని ఐటీడీఏ సహకారంతో రూ.18 లక్షల వ్యయంతో విద్యుత్ సౌకర్యం కల్పించి గిరిజన రైతుల కష్టాలు తీర్చామన్నారు. వివిధ శాఖల సమన్వయంతో త్రీ ఫేస్ లైన్‌తోపాటు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 8 ఏర్పాటు చేశామని, 11కేవీ లైన్ సమకూర్చామన్నారు. కరెంట్ రాగానే అశ్రద్ధ చేయకుండా సులభతరమైన పంటలు మొక్కజొన్న, రాగులు, పల్లీలు, సజ్జలు, జొన్నలు పండించి అధిక లాభాలు గడించాలన్నారు. కాగా.. కోరిన వెంటనే ఆ రెండు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి అహర్నిశలు పాటుపడిన ఐటీడీఏ యూనిట్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, ఏపీవో పవర్ మునీర్ పాషా, కరెంట్ డీఈ జీవన్‌కుమార్, ఏడీ వేణు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'హైవే' సర్వే వద్దంటూ రైతుల ఆందోళన

- రైతులను భూముల్లోకి రాకుండా అడ్డుకున్న పోలీసులు
- రైతులు, పోలీసుల మధ్య తోపులాట
- పోలీస్ పహారా నడుమ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సర్వే

వైరా రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులను చెదరగొడుతున్న పోలీసులు

రఘునాథపాలెం, జూన్ 15 : హైవేల నిర్మాణం పేరుతో వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తమ భూములను లాక్కోవద్దని హెచ్చరిస్తూ భూమి కోల్పోతున్న రైతులు ఆందోళనకు దిగారు. తమకు తెలియకుండా వచ్చి సర్వే చేయడం ఏమిటంటూ ప్రశ్నించారు. భూముల సర్వేను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వీ వెంకటాయపాలెం వద్ద వైరా ప్రధాన రహదారిపై శనివారం తెల్లవారుజామున రైతులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా వీ వెంకటాయపాలెం రెవెన్యూ పరిధిలో నాగ్‌పూర్ టు అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రెవెన్యూ అధికారులు పోలీసు పహారా నడుమ శనివారం తెల్లవారుజామున 5 గంటలకు భూ సర్వే చేపట్టారు.

భూములు కోల్పోతున్న రైతులకు ముందస్తు నోటీసులు జారీ చేయకుండానే అధికారులు మూడు బృందాలుగా పోలీసులతో ప్రత్యక్షమయ్యారు. అయితే సర్వే విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి రావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రైతులు వైరా రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో రైతులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు పలువురు రైతులను అరెస్ట్ చేసి రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమ భూములు లాక్కోవడం సరికాదంటూ పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదని పలువురు రైతులు వాపోయారు. రైతులతో సంబంధం లేకుండా సర్వే చేస్తున్న నేషనల్ హైవే అథారిటీ అధికారుల తీరును సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నవీన్‌రెడ్డి తప్పుపట్టారు. రైతులతోపాటు ఆందోళనలో పాల్గొన్న ఆయన వ్యవసాయ మంత్రి తుమ్మల ఇలాకాలో రైతులను నిర్బంధిస్తారా అని ఆయన ప్రశ్నించారు.

అధిక దిగుబడులు పొందాలి

సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్

శిక్షణ పొందిన మత్స్యకారులతో శాస్త్రవేత్తలు

కూసుమంచి, జూన్ 15: మండలంలోని పాలేరులో మూడు రోజులపాటు 'రీసెర్క్‌లేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్' శిక్షణ పొందిన మృత్స్యకారులు శిక్షణను సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు పొందాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. మత్స్యపరిశోధన స్థానం పాలేరు, పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం హైదరబాద్, భారతీయ వ్యవసాయ పరిశోధనామండలి రైతు సంక్షేమశాఖ భారత ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. అనంతరం ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుంచి శిక్షణకు హాజరైన 25మంది మత్స్యకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ బీ రాజ, మత్స్యశాస్త్రవేత్త బీ రవీందర్, టీ భార్గవి, ఎస్ నాగరాజు, మత్స్యకారులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల డిగ్రీలో ప్రవేశాలకు ఆహ్వానం

కొణిజర్ల,, జూన్ 15: స్థానిక గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, ఖమ్మంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం ఆహ్వానం పలుకుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.మానస, ఖమ్మం ఆర్‌సీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 18 నుంచి 23వ తేదీ లోపు నిర్వహించే స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు అన్నిరకాల ఒరిజినల్ సర్టిఫికెట్స్, మూడు జిరాక్స్ సెట్లు, ఆధార్‌కార్డు, ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు 949106 3083, 9640947467 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

భవనం కట్టారు.. వసతులు మరిచారు

- మూత్రశాల, మరుగుదొడ్లు లేవు
- ప్రహరీలేక తరచూ ప్రమాదాలు
- అవస్థలు పడుతున్న అంగన్‌వాడీ చిన్నారులు

అంగన్‌వాడీ భవనం

ఖమ్మం రూరల్, జూన్ 15: దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించాలి అనే రీతిలో ఉంది మండల అధికారుల తీరు. ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పరిస్థితిని చూసి వసతులు కల్పించాలని ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేదు. మండలంలోని పెద్దతండా పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో సుమారు 300 కుటుంబాలకు పైగా ఉన్నాయి. రెండు సంవత్సరాల క్రితం వరకు ఈ కాలనీలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీల సేవలు పొందేందుకు నాయుడుపేట వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితిని గమనించిన అప్పటి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి దృష్టికి స్థానికులు సమస్యను తీసుకవెళ్లడంతో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం మంజూరైంది. అనంతరం భవన నిర్మాణం పూర్తి కావడంతో నాయుడుపేట నుంచి ఐసీడీఎస్ అధికారులు కేంద్రాన్ని ఇందిరమ్మ కాలనీకి తరలించారు. అయితే భవన నిర్మాణం పూర్తయిందే తప్ప మౌలిక వసతుల కల్పన, ప్రహరీ నిర్మాణం చేపట్టాలనే అలోచన చేయకపోవడం విశేషం.

ఒకవైపు అభద్రత, మరోవైపు అసౌకర్యాలు

అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంఖ్య ఎక్కువ ఉన్నప్పటికీ సమస్యలతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో పిల్లలను కాపాడు కోవడం సిబ్బందికి తలకుమించిన భారం అవుతుంది, ఇది ఇలా ఉండగా.. కేంద్రంలో తాగునీరు, ఇతర నీటి సౌకర్యం అందుబాటులో లేదు, మూత్ర, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో సిబ్బంది, పిల్లల ఇబ్బందులు, అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా మండల అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు ప్రమాదపు, అసౌకర్యాల నడుమ సాగుతున్న ఈ కేంద్రానికి అవసరమైన వసతులు కల్పించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

ఎర్రుపాలెం, జూన్ 15: కూసుమంచి మండలంలోని జక్కేపల్లిలో శ్రీసత్యసాయి రైతు సేవా నిలయంలో ఈ నెల 16న ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నారని రైతు సేవా కోఆర్డినేటర్ కుడుముల వెంకటరామిరెడ్డి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశవాళి వరి విత్తనాల సేకరణ కర్త విజయరామ్, డాక్టర్ కే.వై.రామచంద్రరావు, ఎఫ్‌పీఓ తెలంగాణ అధ్యక్షుడు సొల్లేటి జైపాల్‌రెడ్డి, శ్రీసత్యసాయి సేవా సంస్థల ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దమ్మాలపాటి సుధాకర్‌రావు పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1:1 నిష్పత్తిలో ఉద్యోగోన్నతుల ఖాళీల జాబితా

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 15 : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ప్రక్రియలో భాగంగా విద్యాశాఖాధికారులు ఖాళీలన్నింటినీ ప్రదర్శించకుండా 1:1 నిష్పత్తిలో ఖాళీల జాబితాను విడుదల చేశారు. గత రెండు దఫాలుగా విడుదల చేసిన జాబితాలో అర్హులైన ఉపాధ్యాయులతో సంబంధం లేకుండా ఖాళీల జాబితాను ప్రకటించారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు ఉద్యోగోన్నతులకు అర్హులైన సంఖ్యకు సమానంగా ఖాళీలను శనివారం ప్రకటించారు. ఖాళీల జాబితాలో కూడా తొలుత ప్రాధాన్యతగా ఆయా సబ్జెక్టులు బోధించడానికి ఎవ్వరూలేని స్కూల్స్‌ని ఎంపిక చేశారు. తర్వాత ప్రాధాన్యతలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నవాటిని ఎంపిక చేశారు. ఖాళీల జాబితాలో స్కూల్స్ వివరాలతో పాటు విద్యార్థుల సంఖ్యను కూడా పొందుపర్చారు. ఖాళీల జాబితాపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఇప్పటికే అన్ని ఉపాధ్యాయ సంఘాలు డీఈవో సోమశేఖరశర్మకి వినతిపత్రం అందజేశాయి. శనివారం నుంచి ఆదివారం ఉదయం 10గంటల వరకు ఉద్యోగోన్నతులకు సంబంధించిన వెబ్‌సైట్‌లో ఆప్షన్స్‌లు ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

నేడు కృత్రిమ అవయవాల పంపిణీ

హిమాయత్‌నగర్, జూన్ 15 : ప్రమాదవశాత్తు జీవితం మధ్యలో ఏదైనా అవయవం కోల్పోయి దివ్యాంగులుగా మారిన వారికి ఆదివారం హైదరాబాద్ కింగ్ కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆర్టిఫీషియల్ లింబ్, కాలిఫర్స్, ఫిట్‌మెంట్‌తోపాటు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్నట్లు నారాయణ్ సేవా సంస్థాన్ ట్రస్టీ డైరెక్టర్ దేవేంద్ర చౌబిసా,కో-ఆర్డినేటర్ అల్కా చౌదరి తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆవిష్కరించారు. 39 ఏండ్లుగా వివిధ రాష్ట్రాల్లోని దివ్యాంగులకు ప్రయోజనం కల్పించేందుకు సంస్థ కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజికవేత్త రితేష్ జగీర్దార్, సంస్థ ప్రతినిధులు ఉత్తమ్ దామ్రాణి, మహేంద్రసింగ్ రావత్, జస్మిత్ పటేల్, భగవాన్ ప్రసాద్ గౌర్ పాల్గొన్నారు.